

వ్యవసాయ సాంకేతిక పద్ధతులపై రైతులకు శిక్షణ

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

మండల పరిధిలోని వెంగళమ్మచెరువు వాటర్ షెడ్ ప్రాంత రైతులకు నూతన వ్యవసాయ సాంకేతిక పద్ధతులపై శిక్షణ ఇస్తున్నట్లు వాటర్ షెడ్ సాంకేతిక అధికారి భాస్కర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆచార్య ఎన్జీ రంగా విశ్వవిద్యాలయం భారత వ్యవసాయ పరిశోధన మండలి, కృషి విజ్ఞాన కేంద్రం అనంతపురం జిల్లాకు చెందిన శాస్త్రవేత్తలు, శ్రీసత్యసాయి జిల్లా ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు వెంగళమ్మ చెరువు వాటర్ షెడ్ పరిధిలోని రైతులకు చెర్లోపల్లి నూతన రైతు భరోసా కేంద్రంలో జులై 17 నుంచి 21 వరకు ఆధునిక సాంకేతిక వ్యవసాయ పద్ధతుల ద్వారా తక్కువ పెట్టుబడి అధిక దిగుబడులు, పంటలో నాణ్యతలు, సమయానుకూలంగా పంటల సాగులో చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలపై రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ కార్యక్ర మాన్ని రైతులు సద్వినియోగం చేసుకొని వ్యవసాయంలో మెలకువలు తెలుసుకొని, నాణ్యమైన దిగుబడులు సాధించాలని ఆయన సూచించారు.

కాలుష్య కుంపటిగా 'పురం' డంపింగ్‌యార్డు

పొగ, దుర్వాసనతో ప్రజలు, విద్యార్థుల ఇబ్బందులు

పట్టించుకోని పాలకులు, అధికారులు



డంపింగ్ యార్డులో పేరుకు పోయిన చెత్త దిబ్బలు

పాలకులు మారినా, అధికారులు మారినా అహ్మద్‌నగర్, శ్రీ సత్య సాయి నగర్ ప్రాంత ప్రజల తలరాతలు మారడం లేదు. ఈ ప్రాంతాలకు పక్కన ఉన్న మున్సిపల్ డంపింగ్ యార్డు నుంచి వెలువడే పొగ, దుర్వాసనతో ప్రజలు జీవన పోరాటం చేస్తున్నారు. అదే చెత్తలో విద్యార్థులు చదుకోవాల్సిన దుస్థితి ఉంది. ఇక్కడ నుంచి డంపింగ్ యార్డు తరలిస్తామని గత కొన్ని సంవత్సరాలుగా చెబుతున్న పాలకుల, అధికారుల మాటలు నీటి మీద రాతలుగా మారుతున్నాయి.

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణం ఏర్పాటు అయిన సమయంలో పట్టణ సమీపంలోని పరిగి రోడ్డులో సుమారు 11 ఎకరాల విస్తీర్ణంలో డంపింగ్ యార్డు ఏర్పాటు చేశారు. పట్టణ జనాభా పెరగడంతో పరగి రోడ్డు ప్రాంతంలో సైతం జనావాసాలు ఏర్పాటు అయ్యాయి. మొదట్లో చెత్తాచెదారం తక్కువగా ఉండడం ఎలాంటి ఇబ్బంది లేక పోవడం కారణంగా ప్రభుత్వం పేదల కోసం డంపింగ్ యార్డు పక్కలోనే ఇంటి స్థలాలను కేటాయించింది. ఫలితంగా ఈ ప్రాంతంలో ఆహ్మద్ నగర్, సత్య సాయి నగర్ రూపుదిద్దుకున్నాయి. వేలాది నిర్మాణాలు జరిగి పెద్ద ఎత్తున ఈ ప్రాంతం అభివృద్ధి చెందింది. దీంతో ప్రజలకు అవసరమైన అన్ని మౌళిక సదుపాలయాలను పురపాలక సంఘంతో పాటు ఇతర శాఖల వారు కల్పించారు. వారి పిల్లల కోసం పాఠశాలను సైతం ఏర్పాటు చేశారు. అయితే పట్టణంలో రానురాను జనాభా పెరగడం, చెత్త ఉత్పత్తి ఎక్కువ కావడం ప్లాస్టిక్ ఉత్పత్తులు పెరిగి పోవడం కారణంగా డంపింగ్ యార్డుకు చెత్త తరలింపు ఎక్కువ అయింది. ప్లాస్టిక్ ఇతర వ్యర్థాలు డంపింగ్ యార్డులో చేరడంతో చెత్త కుళ్లిపోకుండా కొండలా పేరుకు పోయింది. కొంత కాలంగా కుళ్లుతున్న ఈ వ్యర్థాల నుంచి దట్టమైన పొగ వెలువడుతూ ఈ డంపింగ్‌యార్డు వాయు కాలుష్య ఉత్పత్తి కేంద్రంగా మారింది. దీంతో ఈ ప్రాంతంలో దుర్వాసన వెదజల్లుతుంది. చెత్త నుంచి మిథేన్ తదితర వాయువులతో మంటలు చెలరేగుతున్నాయి. వీటి నుంచి వెలువడే విషయువులు, పొగ సమీప ప్రాంత వాసులను ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి. నివాసం ఉండడానికే కష్టంగా మారింది. గత కొన్ని సంవత్సరాలు ఇలాంటి పరిస్థితి ఉండటంతో ఈ ప్రాంత ప్రజలు శ్వాసకోశ, ఇతరత్రా వ్యాధుల బారిన పడుతున్నారు. సమస్య పాలకులకు, అధికారులకు తెలిసినా పరిష్కారానికి చొరవ చూపడం లేదన్న విమర్శలు వినపడుతున్నాయి. సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని ఇచ్చిన హామీలు ప్రకటనలకే పరిమితమవుతున్నాయి. ఇప్పటికే ఈ డంపింగ్ యార్డు నిండి చెత్త కొండలా మారిపోయింది.

నూతన డంపింగ్ యార్డుకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో అడుగులు పడ్డాయి. పట్టణ సమీపంలో గుడ్డంపల్లి వద్ద దాదాపు 36 ఎకరాల స్థలాన్ని సేకరించి, డంపింగ్ యార్డును నిర్మాణం చేశారు. అయితే వివిధ కారణాలతో దానికి పూర్తి స్థాయిలో చెత్త తరలింపు జరగడం లేదు. ఇక్కడి డంపింగ్‌యార్డులోని చెత్తలో రబ్బరు, ప్లాస్టిక్, థర్మకోల్, ఫైబర్ తదితర పనికిరాని వస్తువులను వేరు చేయాల్సి ఉంది. వేరు చేసిన ప్లాస్టిక్‌ను పెన్నా సిమెంట్ పరిశ్రమకు తరలించాల్సి ఉంది. అయితే అదేదీ జరగలేదు. డంపింగ్ యార్డులో దాదాపు 61.499 లక్షల మెట్రిక్ టన్నుల చెత్త ఉన్నట్లు అధికారులు అంచనావేసి దీని కోసం 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి 4.90కోట్లు కేటాయించారు. గుంటూరుకు చెందిన జ్ఞానేశ్వర్ ఇంజనీరింగ్ ప్రవేటు సంస్థకు 6 నెలల క్రితం పనులను సైతం ఖరారు చేశారు. అయితే ఒక వారం రోజులు పనులు చేసి అక్కడి నుంచి వెళ్లి పోయారు. దీంతో ఈ ప్రాంత ప్రజలకు డంపింగ్ యార్డు శాపంగా మారింది.



సమస్యను వివరిస్తున్న విద్యార్థుల కుటుంబసభ్యులు

శాశ్వత పరిష్కారం ఎప్పుడు..?

హిందూపురం రూరల్ మండలం గుడ్డంపల్లి సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన డంపింగ్‌యార్డుకు సేకరించిన చెత్తను పూర్తి స్థాయిలో తరలించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. కాంపేక్టర్ ద్వారా తరలించే చెత్తను మాత్రమే ఇక్కడికి తరలిస్తున్నారు. ఆటోల ద్వారా సేకరించిన చెత్తను పట్టణంలో ఉన్నా డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు. కొంత మంది ఆకతాయిలు చెత్తకు నిప్పు పెట్టడంతో దట్టమైన పొగతోపాటు, తీవ్ర దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో ఆయా ప్రాంతాల ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు. శాస్త్రీయ పద్దతిలో చెత్తను వేరు చేసే కార్యక్రమంపై అధికారులు దృష్టి సారించకపోవడంతో శాశ్వత పరిష్కారానికి నోచుకోవడం లేదు.

న్యాయ పోరాటాలకు సిద్ధం



పట్టణంలో ఉన్న డంపింగ్ యార్డును తరలించాలని ఇప్పటికే పాలకులకు, అధికారులకు పలుమార్లు విన్నవించాం. అయినప్పటికి వారిలో కనీస చలనం లేదు. ఈ డంపింగ్ యార్డు వల్ల ప్రజలతో పాటు విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే డంపింగ్ యార్డు సమస్యను పరిష్కరించాలి. లేని పక్షంలో న్యాయ పోరాటాలకు సిద్ధమవుతాం.

శ్రీనివాసులు,
ఒపిడిఆర్ రాష్ట్ర అధ్యక్షులు

భయపడుతూ ఉద్యోగం చేస్తున్నాం



డంపింగ్ యార్డు పక్కలోనే పాఠశాల ఉండడంతో నిత్యం భయపడుతు ఇక్కడ విధులు నిర్వహిస్తున్నాం. ఏ క్షణంలో ఎలాంటి విష పురుగులు విద్యార్థులపై దాడి చేస్తాయో...ఏ క్షణంలో పొగలు వ్యాపిస్తాయో అన్న భయంతో ఇక్కడ పని చేస్తున్నాం. ఈగలు విపరీతంగా ఉన్నాయి.

నఫీస్ సుల్తానా,
పాఠశాల హెచ్ఎం

ఊపిరితిత్తుల వ్యాధులు వచ్చే అవకాశం



డంపింగ్ యార్డులో నుంచి వెలువడే దుర్వాసన, విష వాయువు వల్ల గాలిలో ఆక్సిజన్ శాతం తక్కువ ఉంటుంది. ఈ ప్రాంతంలో కలుషితమైన గాలి ఎక్కువగా ఉండటం వల్ల చర్మం, ఊపిరితిత్తుల సంబంధిత వ్యాధులు ఎక్కువగా వ్యాపించే అవకాశాలు ఉన్నాయి. పరిసరాల్లో నివసిస్తున్న ప్రజలు రోగాల బారిన పడి, ఇబ్బందులు ఎదురై, ప్రాణ నష్టం జరిగే అవకాశాలు ఉన్నాయి.

వెంకట రమణ,
చిన్న పిల్లల వైద్యులు

చెత్తను శాస్త్రీయ పద్ధతిలో వేరుచేస్తాం



సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ కోసం మున్సిపాలిటీ ఒక ప్రణాళికను ప్రతిపాదించింది, దీని ద్వారా ప్రాసెసింగ్ చేస్తున్నాం. ఇప్పటికే దీని కోసం రూ.4.90కోట్లు నిధులు కేటాయించాం. అయితే గుత్తేదారులు పనులు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. వారితో చర్చించి పనులు ప్రారంభం అయ్యే విధంగా చర్యలు తీసుకోవడంతో పాటు ఇకపై చెత్తను అక్కడికి తరలించకుండా చర్యలు తీసుకుంటాం.

ప్రమోద్ కుమార్,
మున్సిపల్ కమిషనర్



శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ముఖద్వారం

నేడు ఎస్కేయు 21వ స్నాతకోత్సవం

హాజరుకానున్న గవర్నర్ అబ్దుల్ నజీర్

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం 21వ స్నాతకోత్సవానికి సిద్ధమైంది. సోమవారం జరుగుతున్న ఈ కార్యక్రమానికి ఛాన్సలర్ హోదాలో గవర్నర్ అబ్దుల్ నజీర్ హాజరుకానున్నారు. ఆదివారం రాత్రికే గవర్నర్ అబ్దుల్ నజీర్ అనంతపురం నగరం చేరుకున్నారు. నేడు జరిగే స్నాతకోత్సవంలో ఆయన పాల్గొంటారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన 57 విద్యార్థులకు బంగారు పతకాలతోపాటు 9150 మందికి డిగ్రీ పట్టాలను అందజేయనున్నారు. ఈ సందర్భంగా బెంగళూరుకు చెందిన సమర్థన దివ్యాంగుల సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ జికె.మహంతేష్‌కు గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేయనున్నారు. ఈ కార్యక్రమం సందర్భంగా శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. భువన విజయం ఆడిటోరియంలో స్నాతకోత్సవ కార్యక్రమం జరుగనుంది.

కట్టుదిట్టమైన భద్రత : గవర్నర్ అబ్దుల్ నజీర్ తొలిసారిగా జరుగుతున్న జిల్లా పర్యటన సందర్భంగా అనంతపురం నగరంలో కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేశారు. ఆయన బస చేస్తున్న ఆర్అండ్‌బి అతిథిగృహానికి మెరుగులు దిద్దారు. ఆదివారం రాత్రికే ఆయన వస్తుండటంతో ఉదయం నుంచే ప్రధానమైన కూడళ్లలో పోలీసు పహార ఏర్పాటు చేశారు. అదే విధంగా సప్తగిరి సర్కిల్ నుంచి ఆర్అండ్‌బి వైపు వెళ్లే మార్గంలో తోపుబండ్లను రోడ్డుకు అడ్డంగా లేకుండా పక్కకు తొలగించారు. రాత్రికి ఆయన ఇక్కడే బస చేసి సోమవారం మధ్యాహ్నం మూడున్నర గంటలకు వెనుదిరుగనున్నారు. ఈయనకు జిల్లా కలెక్టరు గౌతమి, ఎస్పీ శ్రీనివాసరావులు స్వాగతం పలికారు.

గవర్నర్ పర్యటన సాగునుంది ఇలా ... ఆదివారం మధ్యాహ్నం 3 : 45 గంటలకు గన్నవరం విమానాశ్రయం చేరుకుంటారు. అక్కడి నుంచి విమానంలో బయలుదేరి 5 : 55 గంటలకు బెంగళూరుకు చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో అనంతపురం బయలుదేరుతారు. మధ్యలో కొడికొండ చెక్‌పోస్టు వద్దనున్న రక్ష ఆకాడమీలో 15 నిమిషాలు విరామం తీసుకుంటారు. సాయంత్రం ఏడున్నర గంటలకు అక్కడి నుంచి బయలుదేరి రాత్రి తొమ్మిది గంటలకు ఆర్అండ్‌బి అతిథిగృహం చేరకుంటారు. రాత్రికి ఇక్కడే బస చేస్తారు. సోమవారం ఉదయం 9:15 గంటలకు అతిథిగృహం నుంచి శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయానికి బయలుదేరుతారు. ఉదయం 9:30 గంటలకు అక్కడికి చేరుకుంటారు. గౌరవ వందనం అనంతరం శ్రీకృష్ణదేరాయ విగ్రహానికి పూలమాల వేస్తారు. అనంతరం ఇంజనీరింగు కళాశాల భవనం, ఇంజనీరింగు కళాశాల వసతిగృహం, ఇంక్యూబేషన్ కేంద్రానికి కొత్తగా వేసిన రహదారిని ప్రారంభిస్తారు. ఇవి పూర్తయిన తరువాత ఉదయం 10 :30 గంటలకు స్నాతకోత్సవం జరుగుతున్న భువన విజయం ఆడిటోరియంలోకి ప్రవేశిస్తారు. మధ్యాహ్నం 12:15 గంటలకు ఈ కార్యక్రమం ముగిస్తుంది. మధ్యాహ్నం 1:15 వరకు గంటపాటు భోజన విరామం ఉంటుంది. అనంతరం అక్కడి నుంచి నగరంలోని ఆర్అండ్‌బి అతిథిగృహం చేరుకుంటారు. మధ్యాహ్నం 2:55 గంటలకు అతిథిగృహం నుంచి బయలుదేరి మూడు గంటలకు విజయనగర లా కళాశాలకు చేరుకుంటారు. అక్కడ నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. అనంతరం బెంగళూరుకు రోడ్డు మార్గంలో తిరుగు ప్రయాణమై వెళతారు.

సిమెంట్ స్వాహాలో సంబంధం లేదు : ఎమ్మెల్యే

మడకశిర రూరల్ : నియోజకవర్గంలోని గ్రామ సచివాలయాల నిర్మాణాలకు ప్రభుత్వం మంజూరు చేసిన సిమెంట్‌కు సంబందించిన గోల్‌మాల్ వ్యవహారంలో తనకు సంబంధం లేదని, ఇంజనీర్లు పనులకు వినియోగించకుండా కర్నాటకలో విక్రయించారని తెలిసి వారిపై ప్రభుత్వానికి ఫిర్యాదు చేశానని ఎమ్మెల్యే తిప్పేస్వామి తెలిపారు. సిమెంట్ గోల్‌మాల్‌కు పాల్పడడం తోనే ఇంజనీర్లు సస్పెండ్ అయ్యారని గుర్తుచేశారు. మండల పరిధిలోని చందకచెర్లలో ఆదివారం ఎమ్మెల్యే మీడియా సమావేశంలో మాట్లాడుతూ తనపై ఉద్దేశ పూర్వకంగా కొందరు అసత్య ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు. పలుచోట్ల గ్రామ సచివాలయాలు, ఆర్బీకేలు, హెల్త్ సెంటర్ల నిర్మాణాలు అర్ధాంతరంగా ఆగిపోయాయని గుర్తించి వెంటనే సిమెంట్ గోల్‌మాల్‌పై ప్రభుత్వానికి ఫిర్యాదు చేశానన్నారు. తాను గోల్‌మాల్‌కు పాల్పడి ఉంటే ప్రభుత్వానికి ఎందుకు ఫిర్యాదు చేస్తానని ప్రశ్నించారు. రొళ్ల ఎంపీపీ భర్త విజయరంగేగౌడ్ సిమెంట్ గోల్‌మాల్‌లో తనపై ఆరోపణలు చేయడంలో అర్థం లేదన్నారు. ఒప్పందం ప్రకారం ఎంపీపీ పదవి పోతుందనే భయంతో తనపై ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. అలాగే మినీ కిట్ల వేరుశనగ కాయలను ప్రతి ఆర్బీకేలకు అందించి పేద రైతులకు ఇవ్వాలని చెప్పానన్నారు. కానీ దీనిని జీర్ణించులేక విజయరంగేగౌడ్ వ్యవసాయ కార్యాలయానికి వెళ్లి తాళం వేశాడని సంబంధిత అధికారిణి స్టేషన్లలో ఫిర్యాదు చేసిందన్నారు. దీనికి తనకు ఏమీ సంబంధం లేదన్నారు. తనపై తప్పడు ఆరోపణలు చేసిన వారిపై అధిష్టానం దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు.

అభివృద్ధికి ఆమడదూరంలో రామగిరి

నేటికీ రోడ్డు సౌకర్యం లేని గ్రామం

పట్టించుకోని పాలకులు, అధికారులు



అధ్వానంగా ఉన్న గ్రామానికి వెళ్లే రహదారి

ప్రజాశక్తి మడకశిర

స్వాతంత్రం సిద్ధించి 75 ఏళ్లు గడుస్తున్నా నేటికీ కూడా చాలా గ్రామాలు కనీస సౌకర్యాలు నోచుకోకపోవడం శోచనీయం. పాలకులు, అధికారులు మారుతున్నారే తప్ప ఆ గ్రామస్తుల తలరాతలు మాత్రం మారలేదని చెప్పవచ్చు. అందుకు ఉదాహరణ మండల పరిధిలోని ఆమిదాల గొంది పంచాయతీ డి. రామగిరి గ్రామం. ఈ గ్రామంలో నేటికీ రోడ్డు సౌకర్యం లేక ప్రజల అవస్థలు పడుతున్నారు. డి రామగిరి గ్రామంలో 80 కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. వారందరూ ఒకే సామాజికవర్గానికి చెందిన వారు. బోయ సామాజికవర్గానికి చెందిన వారు నివసిస్తున్న ఈ గ్రామం కొండ ప్రాంతానికి ఆనుకొని ఉంది. ఆ గ్రామానికి రోడ్డు సౌకర్యం లేకపోవడంతో 108, 104 వాహనాలు రాలేని పరిస్థితి. సంవత్సరం క్రితం రోడ్డుకు వేసిన కంకర అలాగే ఉంది. దీంతో ఆ కంకరలోనే ప్రజలు నడుచుకొని వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. గర్భిణులు, బాలింతలు ఆసుపత్రికి వెళ్లాలంటేకనీసం రెండు కిలోమీటర్ల నడిచి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. పాలకులు ఎన్నికల సమయంలో వచ్చి ఓట్లు వేయించుకుంటున్నారే తప్ప ఆ అవస్థలు మాత్రం పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నేటికీ కూడా ఆ గ్రామానికి రోడ్డు సౌకర్యం లేకపోవటాన్ని బటి చూస్తే ఆగ్రామం పట్ల పాలకులకు, అధికారులకు ఎంత వివక్ష ఉందో అర్థం అవుతోంది.

కేరళ తరహాలో వైద్యులకు రక్షణ కల్పించాలి

ఐఎంఎ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ రవికృష్ణ

ప్రజాశక్తి అనంతపురం

రాష్ట్ర ప్రభుత్వం వైద్యులకు కేరళ తరహాలో భద్రత కల్పించాలని ఆసుపత్రులపై దాడులను నిరోధించాలని ఐఎంఎ రాష్ట్ర శాఖ అధ్యక్షులు డాక్టర్ రవికృష్ణ తెలిపారు. ఆదివారం అనంతపురంలో స్థానిక ఐఎంఎ శాఖ ఆధ్వర్యంలో ప్రాంతీయ వైద్య వైజ్ఞానిక సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర శాఖ అధ్యక్షులు డాక్టర్ రవికృష్ణ మాట్లాడుతూ భారతీయ వైద్య సంఘం(ఇండియన్ మెడికల్ అసోసియేషన్) ప్రపంచంలోనే అతి పెద్ద వృత్తి సంఘమని అన్నారు. ఐఎంఎ ప్రయివేటు వైద్యుల సంఘం అనే అపోహ ఉందని, తమ సంఘం సభ్యులు ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులలో సేవలు అందిస్తున్నారని అన్నారు. వైద్యుల రక్షణ చట్టం పటిష్టం చేయాల్సిన అవసరం రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలపై ఉందన్నారు. ఇటీవల కేరళలో యువ వైద్యురాలు వందనా దాస్ హత్యకు గురైన నేపథ్యంలో ఆ రాష్ట్రంలో వైద్య రక్షణ చట్టాన్ని కఠిన తరం చేశారని చెప్పారు. అదే తరహాలో ఆంధ్రప్రదేశ్‌లో చట్టాన్ని అమలు చేస్తే వైద్యులకు భద్రత కల్పించినట్లు అవుతుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం కూడా జాతీయ స్థాయి వైద్యుల రక్షణ చట్టాన్ని తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. వైద్యులపై కేసుల నమోదుకు నిర్దిష్ట నియమావళి ఉండాలన్నారు. రాష్ట్రంలో అధిక శాతం ప్రజలకు ప్రైవేటు రంగంలోనే వైద్యం అందుతోందనిఈ నేపథ్యంలో ప్రైవేటు ఆసుపత్రులు ఏర్పాటు చేసే సమయంలో ఉన్న వివిధ అనుమతులు,లైసెన్సులు ఏక గవాక్ష విధానంలో ఇవ్వాలని కోరారు. రాష్ట్రంలో డాక్టర్ వైయస్సార్ ఆరోగ్యశ్రీ పథకం పరిధిని మరింత విస్తృతం చేసిన ప్రభుత్వ తీరు హర్షనీయమన్నారు. అయితే 20 పడకల ఆసుపత్రులకు ఆరోగ్యశ్రీ వర్తింప చేస్తే పేద సామాన్య ప్రజలకు మరింత ప్రయోజనం ఉంటుందని అభిప్రాయపడ్డారు. ఆసుపత్రుల నుండి సేకరించే ఆసుపత్రి వ్యర్థాల రుసుములు నిర్వహణ వ్యయానికి అనుగుణంగా ఉండాలని రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి సలహా కమిటీలో ఐఎంఎతో చర్చించి నిర్ణయం తీసుకోవాలని కోరారు. శిక్షణ లేని వైద్యం చేస్తున్న క్లినిక్ ల పై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని, అందుకు అనుగుణంగా నేషనల్ మెడికల్ కమిషన్ సూచనల మేరకు అవసరమైన చర్యలు చేపట్టాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వ వైద్య పురస్కారాలు ఇవ్వాలన్నారు. ఐఎంఎ జాతీయ ఉపాధ్యక్షులు డాక్టర్ శ్రీహరి మాట్లాడుతూ అన్ని రకాల వైద్య విధానాలపై ఐఎంఎకు గౌరవం ఉందని చెప్పారు. ప్రజలకు ఏ వైద్య విధానం కావాలో వారే నిర్ణయించుకుని ఆ వైద్య విధానంలో చికిత్స పొందడానికి అవకాశం కల్పించాలని, కోరారు. ఐఎంఎ రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు డాక్టర్ జి.హేమలత మాట్లాడుతూ ప్రజలకు మరింత మెరుగైన వైద్యం అందించడం కోసం రాష్ట్రములో ఉన్న 98 ఐఎంఎ శాఖల ద్వారా వైద్యులకు నిరంతర వైద్య విద్య కార్యక్రమాలు నిర్వహించి వారికి ఆధునిక వైద్య విజ్ఞాన శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నామన్నారు. ఐఎంఎ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ మనోరంజన్ రెడ్డి ప్రతి ఐఎంఎ శాఖ ఒక గ్రామాన్ని దత్తతకు తీసుకుని ఆ గ్రామంలో సమగ్ర ఆరోగ్య రక్షణ కార్యక్రమాలు చేపట్టాలని ప్రణాళిక రూపొందిస్తున్నామని తెలిపారు.ఈ సమావేశంలో ఐఎంఎ రాష్ట్ర కోశాధికారి రవీంద్రనాథ్, సంయుక్త కార్యదర్శి డాక్టర్ ఎవి.సుబ్బారెడ్డి, అనంతపురం ఐఎంఎ కార్యదర్శి డాక్టర్ అభిషేక్ రెడ్డి, సీనియర్ వైద్యులు రామసుబ్బయ్య, రామ సుబ్బారావు, అచ్యుత ప్రసాద్, కొండయ్య, శ్రీనాథ్, గేయానంద్, ప్రసూన, సుధీంద్ర, సతీష్, సత్యనారాయణ, గోపి, సుప్రజ తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో పాల్గొన్న ఐఎంఐ ప్రతినిధులు

నెలాఖరులోపు 19వేల ఇళ్ల నిర్మాణాలు

ప్రజాశక్తి -అనంతపురం

ప్రభుత్వం జిల్లాలో ఇళ్లనిర్మాణాలను ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ఈనెలాఖరునాటికి 19వేల ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని కలెక్టర్ హౌసింగ్ అధికారులకు లక్ష్యాన్ని నిర్ధేశించారు. ఈ సందర్భంగా జిల్లాలో ఇళ్ల నిర్మాణాల గురించి హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్ కేశవనాయుడు పలు విషయాలను వెల్లడించారు.



ప్రశ్న : జిల్లాలో ఇళ్ల నిర్మాణాలు ఏ విధంగా జరుగుతున్నాయి ?ఎన్ని ఇళ్లను పూర్తి చేసేందుకు ప్రణాళిక రూపొందించారు ?

జవాబు : జిల్లా లో ఇళ్లనిర్మాణాలు శరవేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు తగిన చర్యలు చేపట్టాం. ఈ నెలాఖరుకల్లా 19వేల ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం.

ప్ర: బిల్లుల చెల్లింపు ఏ విధంగా ఉంది ?

జ : ఇళ్ల నిర్మాణాల బిల్లులను స్టేజ్ వైజ్ చెల్లించేలా చర్యలు తీసుకుంటున్నాం. ప్రతి నెల ఒకటో తేదీ నుంచి 15వ తేదీవరకు ఒకసారి, మిగిలిన 15 రోజులకు మరోసారి చెల్లించేలా చర్యలు తీసుకున్నాం. బిల్లులు పెండింగు లేకుండా చూస్తున్నాం.

ప్ర: జగనన్నలేఅవుట్లలో మౌలిక వసతుల కల్పన ఎలా ఉంది ?

జ: జగనన్న లేఅవుట్లలో రోడ్లు, తాగునీరు, విద్యుత్ సౌకర్యం కల్పించేలా చూస్తున్నాం. కాంట్రాక్టర్లకు 15 రోజులకు ఒకసారి బిల్లులు ఇప్పించి వేగవంతంగా వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నాం.

ప్ర : హౌసింగ్ శాఖలో సిబ్బంది సమస్యలపై ఎలాంటి చర్యలు తీసుకున్నారు ?

జ: 70 మంది వర్క్ఇన్స్‌పెక్టర్ల కొరత ఉంది. అదే విధంగా 4 డిఇ పోస్టులు, ఈఈ పోస్టు ఖాళీలు ఉన్నాయి. సచివాలయ ఇంజనీరింగు అసిస్టెంట్ల వల్ల పని నడుస్తోంది. పూర్తి స్థాయి సిబ్బందిని నియమిస్తే పనులుమరింత వేగవంతం చేస్తాం .

హౌసింగ్ పీడీ కేశవనాయుడు



హౌసింగ్ పీడీ కేశవనాయుడు

ప్ర : గృహ ప్రవేశాల తేదీలు ఖరారయ్యాయా?

జ: మరో ఇరవై రోజుల్లో గృహ ప్రవేశాల తేదీలు ఖరారు కావచ్చు. అందుకు ముందస్తుగా సిద్ధమవుతున్నాం.

సమస్యలపై నిర్లక్ష్యం తగదు

వైద్యులపై జాయింట్ కమిషనర్ సరళ ఆగ్రహం



వైద్య సేవలు పొందుతున్న బాలుడితో మాట్లాడుతున్న జాయింట్ కమిషనర్ డాక్టర్ సరళ

ప్రజాశక్తి-హిందూపురం

జిల్లా స్థాయి ఆసుపత్రిలో ఉన్న సమస్యలను ఎప్పటికప్పుడు అధికారుల దృష్టికి తీసుకెళ్లకుండా.. నిద్ర పోతున్నారా.. అంటు వైద్యులు, వైద్య ఆరోగ్య సిబ్బందిపై వైద్య విధాన పరిషత్ జాయింట్ కమిషనర్ డాక్టర్ సరళ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆమె ఆదివారం హిందూపురం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈకొంత మంది రోగులు సిటీ స్కాన్ పని చేయడం లేదని, రెడియాలజిస్టు లేదని, గైనిక్ విభాగంలో వైద్యులు అందుబాటులో ఉండరని ఆమెకు ఫిర్యాదు చేశారు. అవుట్ సోర్సింగ్‌లో పనిచేసే సిబ్బందికి 9 నెలలుగా వేతనాలు మంజూరు కాలేదని, జీవనం సాగించలేక పోతున్నామని జాయింట్ కమిషనర్ వద్ద బాధిత సిబ్బంది వాపోయారు. స్పందించిన జాయింట్ కమిషనర్ అక్కడే ఉన్న డాక్టర్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. చిన్న ఉద్యోగులకు 9 నెలలుగా వేతనాలు ఇవ్వకుండా నిద్రపోతున్నారా వేతనాలు ఇవ్వకుండా మీరేం చేస్తున్నారు అంటూ ప్రశ్నించారు. అలాగే ఆర్థో విభాగంలో ఇద్దరు వైద్యులు ఉన్నప్పటికి శస్త్ర చికిత్సలు జరగడం లేదని ఫిర్యాదు చేశారు. కొంత మంది వైద్యులు డయాలసిస్ కేంద్రం ఉందని, జిల్లా ఆసుపత్రి కావడంతో అత్యవసర కేసులు వస్తుంటాయని ఫిజీషియన్ కొరత ఉందని తెలిపారు. అనంతరం జాయింట్ కమిషనర్ సరళ మీడియాతో మాట్లాడుతూ ఆసుపత్రిలో ఉన్నా సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకొంటామన్నారు. పూర్వ మెడికల్ సూపరింటెండెంట్ కేశవులు ఆసుపత్రికి వచ్చి జాయింట్ కమిషనర్‌ను కలిసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంఒ రుక్మిణమ్మ, వైద్యులు వెంకట రమణ నాయక్, ఇఫ్తాఖ్, శ్రీ కాంత్ ఇతర వైద్యులతో పాటు వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో షబ్బీర్‌ను సన్మానిస్తున్న ప్రింట్, ఎలక్ట్రానిక్ పాత్రికేయులు

పాత్రికేయులు ప్రజాప్రయోజనాలపై దృష్టి సారించాలి

ప్రజాశక్తి-హిందూపురం

పాత్రికేయులు తమ వృత్తిలో గుర్తింపు పొందాలంటే ప్రజా ప్రయోజనాలపై దృష్టి సారించి, వివిధ సమస్యలను పరిశీలనాత్మక కథనాల ద్వారా వెలుగులోకి తీసుకుని రావాలని సీనియర్ పాత్రికేయులు రాంప్రసాద్, సుధాకర్, ఫణి, రవీంద్ర రెడ్డి, చంద్ర శేఖర్ రెడ్డి, సురేష్ రెడ్డి అన్నారు. ప్రజాశక్తి సీనియర్ పాత్రియులు షబ్బీర్‌కు ఆ సంస్థ రాష్ట్ర స్థాయిలో ఉత్తమ పాత్రియుడిగా ఎంపిక చేసి బొమ్మిరెడ్డి అవార్డును అందించి సత్కరించింది. ఈ నేపథ్యంలో హిందూపురం ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో షబ్బీర్‌ను సన్మానించారు. ప్రెస్ క్లబ్ అధ్యక్షులు సురేష్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో పాత్రికేయులు మాట్లాడుతూ షబ్బీర్‌కు రాష్ట్రస్థాయిలో గుర్తింపు రావడం అభినందనీయమన్నారు. తమకుంట పారిశ్రామిక వాడలో ప్రధాన సమస్య అయిన కాలుష్యంపై చక్కని కథనాన్ని రాశారన్నారు, అనంతరం షబ్బీర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా పాత్రికేయులు హనుమంతరెడ్డి, నరసింహ, రామాంజి, సిద్దు, మురళి, అంజినమూర్తి, ప్రకాష్, చరణ్, ప్రదీప్, మాళప్ప, దాసప్ప, గిరి, గోపాల్ పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

వివాహిత ఆత్మహత్య

అమరాపురం : వివాహిత ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఆదివారం మండల పరిధిలోని తమ్మడేపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. హనుమంతరాయ భార్య లత(32) ఇంట్లో ఎవరూ లేని సమయంలో దూలానికి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. వారికి ఇద్దరు సంతానం. విషయం తెలిసిన వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని మడకశిర ఆసుపత్రికి తరలించారు. అలాగే కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కర్నాటక మద్యం పట్టివేత

రొద్దం : అందిన సమాచారం మేరకు ఎస్ఐ నాగస్వామి ఆదివారం పోలీసు సిబ్బందితో వెళ్లి మండల పరిధిలోని రాచూరు గ్రామ సమీపంలో అక్రమంగా తరలిస్తున్న కర్నాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. అలాగే చెన్నేకొత్తపల్లి మండలంలోని న్యామద్దెల గ్రామానికి చెందిన నారాయణ కుమారుడు కె.మారుతిని అరెస్టు చేసి అతని నుంచి 96 టెట్రా ప్యాకెట్లు, మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. అతనిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్ఐ నాగస్వామి తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

రొళ్ల : అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను ఆదివారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలు.. మండల పరిధిలోని అగ్రహారం గ్రామం చివరలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ యజమాని హేమరాజుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకటరమణ తెలిపారు.

న్యాయవాదుల సంక్షేమానికి సిఎం జగన్ కృషి

ప్రజాశక్తి-పెనుకొండ



సిఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఎంపి, ఎమ్మెల్యే, జడ్పి ఛైర్‌పర్సన్

న్యాయవాదుల సంక్షేమానికి సిఎం జగన్ కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే శంకరనారాయణ పేర్కొన్నారు. పట్టణంలోని నామదారయ్య కళ్యాణ మండపంలో ఆదివారం 'పెనుకొండ బార్ అసోసియేషన్ అధ్యక్షులు డి.నాగ రాజు అధ్యక్షతన సిఎం జగన్‌కి కృతజ్ఞతలు తెలుపుతూ సభ ఏర్పాటు చేయగా ముఖ్య అతిథులుగా ఎంపి గోరంట్ల మాధవ్, ఎమ్మెల్యే మంగమ్మ, జడ్పి ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, ఎపి బార్ కౌన్సిల్ సభ్యులు మాధవి, మడిగుబ్బ ఎంపిపి ఆదినారాయణ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథులు మాట్లాడుతూ వైఎస్ జగన్ పాదయాత్ర సమయంలో ఇచ్చిన ప్రతి హామీని జగన్మోహన్ రెడ్డి అధికారం చేపట్టిన తర్వాత అమలు చేశారన్నారు. ముఖ్యంగా జూనియర్ న్యాయవాదులకు లా నేస్తం కింద రూ. 5వేలు అందించారన్నారు. అలాగే న్యాయవాదుల సంక్షేమానికి రూ. 100 కోట్ల నిధిని కేటాయించారని తెలిపారు. అనంతరం సిఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో నగర పంచాయతీ ఛైర్‌పర్సన్ ఫరూక్, వైస్ ఛైర్మన్ సునీల్, జడ్పీటీసీ శ్రీరాములు, ఎంపీపీ గీతామోహన్‌రెడ్డి, చంద్రశేఖర్, వెంకటరత్నం, కన్వీనర్ నాగలూరుబాబు, నారాయణరెడ్డి, ఎపిపి నాగేశ్వర, న్యాయవాదులుశర్మ, కమల్, మోహన్ నాయక్, వి.శ్రీనివాసులు, విక్రాంత్ నాయక్, బాలాజీ, రమా పావని, ప్రజాప్రతినిధులు, వైసిపి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు యథావిధిగా స్పందన

పుట్టపర్తి అర్బన్ : ప్రతి సోమవారం నిర్వహించే స్పందన (గ్రీవెన్స్ సోమవారం(నేడు) యథావిధిగా నిర్వహిస్తామని కలెక్టర్ అరుణ్‌బాబు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. సోమవారం ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు స్పందన కార్యక్రమం జరుగుతుందన్నారు. మండల, డివిజన్ కార్యాలయాల్లో కూడా స్పందన కార్యక్రమాన్ని అక్కడి అధికారులు నిర్వహిస్తారని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రేపు ఆశాకార్యకర్తల ధర్నా

గుడిబండ : ఈ నెల 18వ తేదీ డిఎంహెచ్ఓ కార్యాలయం ముందు ఆశా వర్కర్ల యూనియన్ స్టేట్ కమిటీ చేపట్ట బోయే ధర్నాలో జిల్లాలోని ఆశా వర్కర్లందరూ పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా ఆశా వర్కర్ల యూనియన్ నాయకురాలు సౌభాగ్యమ్మ కోరారు. గుడిబండలో ఆదివారం ఆమె మాట్లాడుతూ దీర్ఘకాలికం గా ఆశా వర్కర్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం స్టేట్ కమిటీ రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలకు పిలుపు నిచ్చిందన్నారు. కావున ధర్నాలో జిల్లాలోని అన్ని మండలాల ఆశా వర్కర్లు పాల్గొనాలని ఆమె కోరారు.

'ధర్మస్థలం'కు ప్రత్యేక బస్సు

మడకశిర : కర్నాటకలోని ధర్మస్థలంలో వెలసిన మంజునాథస్వామి దర్శనార్థం వెళ్లే భక్తుల కోసం మడకశిర ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు. ఈ బస్సు ప్రతి శనివారం సాయంత్రం అమరాపురం బస్టాండ్ నుంచి బయల్దేరి ఆదివారం ఉదయం ధర్మస్థలం చేరుకుంటుందన్నారు. అనంతరం ఆదివారం అక్కడ బయల్దేరి సోమవారం ఉదయం పట్టణానికి వస్తుందన్నారు. మడకశిర, పావగడ పట్టణ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ అధికారులు సూచించారు.

సర్పంచి తల్లి మృతికి ఎమ్మెల్యే నివాళి

గోరంట్ల రూరల్ : మండల పరిధిలోని గుంతపల్లి సర్పంచి నర్సిరెడ్డి తల్లి బాబిరెడ్డి గారి రంగమ్మ మృతదేహా నికి ఆదివారం ఎమ్మెల్యే శంకరనారాయణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. రంగమ్మ మృతిచెందిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఉదయం గ్రామానికి చేరుకుని నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట జవుకు లదిన్న సుబ్బారెడ్డి, పాటూరి లక్ష్మీరెడ్డి, సమరసింహా రెడ్డి, హేమసుందర రెడ్డి, ఓబుళరెడ్డి, సుధ, జయచంద్రారెడ్డి, వైసిపి నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు ఉన్నారు.

మాజీ ఎంపిటిసి మృతి బాధాకరం

కదిరి టౌన్ : తలుపుల మండల పరిధిలోని కుర్లి మాజీ ఎంపిటిసి ఇదుగొట్టు శంకర్ మృతి బాధాకరమని డాక్టర్ వెంకటరమణ, వైసిపి సంయుక్త కార్యదర్శి హరిప్రసాద్ పేర్కొన్నారు. శంకర్ మృతి చెందిన విషయం తెలిసిన వెంటనే వారు సిద్దుగూరుపల్లిలోని వారి నివాసానికి మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు.

మృతుని కుటుంబానికి పరామర్శ

గాండ్లపెంట : మండల పరిధిలోని సోమయాజులపల్లి ఎంపిటిసి వై.జయరామకృష్ణారెడ్డి తండ్రి వై.చిన్నపరెడ్డి మృతి చెందాడు. ఈ విషయం తెలియడంతో ఆదివారం కదిరి నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి కందికుంట వెంకటప్రసాద్ ఆ గ్రామం వెళ్లి చిన్నపరెడ్డి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. కందికుంట వెంట మండల కన్వీనర్ సి.కొండయ్య, మాజీ ఎంపిపి డి.గంగరాజు, మాజీ సర్పంచి ప్రసాద్, కార్యకర్తలు రామానుజన్ రెడ్డి, దాసిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేడు పోలీస్ స్టేషన్‌కు సెంట్రల్ టీమ్

బత్తలపల్లి : స్థానిక పోలీస్ స్టేషన్‌లో మౌలిక వసతులు, ప్రజలకు అందుతున్న సేవలను పరిశీలించేందుకు సోమవారం సెంట్రల్ టీం బత్తలపల్లికి వస్తున్నట్లు సమాచారం. సెంట్రల్ టీం రాకను పురస్కరించుకుని పోలీస్ స్టేషన్‌ను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. అన్ని గదులను అందంగా ముస్తాబు చేశారు. రంగులు వేయించారు. స్టేషన్ చుట్టూ సిమెంట్ రోడ్డు వేయించారు. నూతనంగా స్టేషన్ బోర్డు ఏర్పాటు చేశారు.

'ఉపాధి' పనులపై నామమాత్రంగా సామాజిక తనిఖీలు

ప్రజాశక్తి-కొత్తచెరువు

మండలంలో జరిగిన ఉపాధి హామీ పనులపై ఎస్ఆర్‌పి కాంతయ్య ఆధ్వర్యంలో డిఆర్‌పిలు సామాజిక తనిఖీలను నామమాత్రంగా నిర్వహించారని విమర్శలు వినిపిస్తున్నాయి. 2022 ఏప్రిల్ నుంచి 2023 మార్చి వరకూ 'ఉపాధి' కింద రూ. 2.99 కోట్లు, పంచాయతీరాజ్ కింద రూ. 3.15 కోట్ల వ్యయంతో మండల వ్యాప్తంగా 15 పంచాయతీల్లో 1106 పనులు నిర్వహించారు. అయితే గ్రామసభలు నిర్వహించకుండా ఈ పనులను తనిఖీ చేశారని, ఇందులో పలు అక్రమాలు చోటు చేసుకున్నా వెలికితీయకుండా ఉద్యోగులకు సహకరించారన్న ఆరోపణ లు ఉన్నాయి. కేవలం 4 రోజులు గ్రామాల్లో పర్యటించి గుట్టుచప్పుడు కాకుండా నామమాత్రంగా నివేదికలు తయారు చేసి, ఆ పనులకు సంబంధించి రూ. 22,169 రికవరీ చేశారు. ఈ మేరకు ఆదివారం ఎంపిడిఓ కార్యాలయం వద్ద ఉదయం 9 నుంచి 11 గంటల వరకూ బహిరంగ సమావేశం నిర్వహించి ముగించారు. ఉపాధి పనుల్లో జరిగిన అక్రమాలపై కలెక్టర్ చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరారు. కార్యక్రమంలో ఉపాధి హామీ పిడి రామాంజనేయులు, ఎపిడి రఘునాథరెడ్డి, ఎంపిపి గాయత్రి రెడ్డప్పరెడ్డి, ఎంపిడిఒ సిద్ధారెడ్డి, టిడిఒ రమణారెడ్డి, ఎపిఒ రాజు, ఎపిఒ నాగిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

అన్ని వర్గాల అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మడకశిర రూరల్



ప్రజలకు పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి

రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల అభివృద్ధికి జగన్ ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి తెలిపారు. మండల పరిధిలోని చందకచెర్ల గ్రామంలో ఆదివారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్థానిక నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. మరోసారి జగన్‌కు అవకాశం కల్పిస్తే మరింత అభివృద్ధి జరుగుతుందని ప్రజలకు కోరారు. అంతకుముందు ఎమ్మెల్యేకి గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికి ఊరేగించా రు. కార్యక్రమంలో వక్కలిగ రాష్ట్ర కార్పొరేషన్ ఛైర్మన్ నళిని రంగే గౌడ్, ఎంపీపీ కవిత సత్యనారాయణరెడ్డి, వాల్మీకి సంఘం రాష్ట్ర డైరెక్టర్ బిఎల్ రామకృష్ణ, జడ్పిటిసి సరోజమ్మమూర్తి, సర్పంచి దేవ్లానాయక్, బొజ్జప్ప, ఎంపీటీసీలు, సర్పంచులు, వైకాపా నాయకులు పాల్గొన్నారు.

హక్కుల సాధనకు వాల్మీకులు ఐక్యంగా ఉద్యమించాలి

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్



వాల్మీకి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వాల్మీకులు

హక్కుల సాధన కోసం వాల్మీకులు రాజకీయ పార్టీలకు అతీతంగా ఐకమత్యంతో కృషి చేయాలని ఎపి వాల్మీకి సంఘం నాయకులు పిలుపునిచ్చారు. పట్టణంలోని శిల్పారామంలో ఆదివారం జిల్లాస్థాయి వాల్మీకి సంఘం విస్తృతస్థాయి సమావేశం ఆ సంఘం నాయకుడు కేశవ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ జక్కల శ్రీనివాసరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు బంగారు కృష్ణమూర్తి, కార్యదర్శి క్రాంతినాయుడు ముఖ్య అతిథిగా గంగాద్రి తదితరులు హాజరై మాట్లాడారు. చాలాకాలంగా వాల్మీకి, బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలని డిమాండ్ చేస్తూనే ఉన్నామన్నారు. అయితే పాలకులు మనల్ని ఓటు బ్యాంకుగా మాత్రమే వినియోగిం చుకుంటున్నారన్నారు. ఎవరు ఏ పార్టీలో ఉన్నప్పటికీ సంఘం నిర్ణయాలకు కట్టుబడి ఉండాలన్నారు. రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా ఎదగడానికి కృషి చేయాలన్నారు. సమావేశంలో జిల్లా యూత్ అధ్యక్షుడు బూదిలి ధనుంజయ, ప్రధాన కార్యదర్శి మల్లికార్జున, రాష్ట్ర కార్యదర్శి నల్లబోతుల మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్‌విఎఫ్ టీ-20 క్రికెట్ టోర్నీ విజేత విషా టీం

ప్రజాశక్తి-బత్తలపల్లి



క్రీడాకారులతో మాంచూ ఫెర్రర్, విశాల ఫెర్రర్

మూడు రోజులుగా స్థానిక ఆర్డీటీ స్పోర్ట్స్ సెంటర్‌లో నిర్వహించిన ఎఫ్‌విఎఫ్ (ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్) టీ-20 కప్-2023 క్రికెట్ టోర్నీ విజేతగా విషా టీం నిలిచింది. ఈ టోర్నీలో విన్సెంట్ టీమ్, అన్నే టీమ్, మాంచూ టీమ్, విషా టీమ్ల మధ్య పోటీలు నిర్వహించగా విషా టీం, అన్నే టీం ఫైనలు చేరాయి. దీంతో ఆదివారం నిర్వహించిన ఫైనల్ పోటీలో తొలుత బ్యాటింగ్ చేసిన విషా టీం 25 ఓవర్లలో 252 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన అన్నే టీం 232 పరుగులు మాత్రమే చేసింది. అనంతరం విజేత విషా జట్టుకు ముఖ్యఅతిథులుగా హాజరైన ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంచూ ఫెర్రర్, ఉమెన్ ఎంపవర్‌మెంట్ డైరెక్టర్ విశాల ఫెర్రర్, హెడ్ కోచ్ యుగంధర్‌రెడ్డి బహుమతులు ప్రదానం చేశారు.

పకడ్బందీగా 'జగనన్న సురక్ష' సర్వే

గోరంట్ల రూరల్ : 'జగనన్న సురక్ష' సర్వేని గ్రామాల్లో సమగ్రంగా నిర్వహించాలని ఎంపీడీవో రఘునాథగుప్తా సూచించారు. మండల పరిధిలోని మందలపల్లి-1, 2, నార్సింపల్లి, వడిగేపల్లి సచివాలయాల ఉద్యోగులు, వాలంటీర్లు, స్థానిక ప్రజా ప్రతినిధులు ఆదివారం ఎంపీడీవో ఆధ్వర్యంలో గోరంట్ల మండల సచివాలయ పరిధిలో ఉన్న వివిధ గ్రామాల్లోని ప్రజల వద్దకు వెళ్లి జగనన్న సురక్ష కార్యక్రమం ఆవశ్యకత గురించి వివరించారు. ప్రజలు ప్రభుత్వం అందించే 11 రకాల ఉచిత సేవలను పొందాలని సూచించారు. కార్యక్రమంలో మందల పల్లి-1, 2, వడిగేపల్లి, నార్సింపల్లి సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.



పొడరాల్లపల్లి గ్రామంలో రైతులతో మాట్లాడుతున్న సూరి

'జిల్లేడుబండ' డ్యాంను సందర్శించిన మాజీ ఎమ్మెల్యే సూరి

ప్రజాశక్తి-ముదిగుబ్బ

మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ ఆదివారం మండల పరిధిలోని పొడరాల్లపల్లి గ్రామ సమీ పంలో నిర్మిస్తున్న జిల్లేడుబండ డ్యాం పనులను పరిశీలించి, రైతులకు అందని నష్టపరిహారాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు వారి పొలం విస్తీర్ణం, ధర, తదితర వివరాలను అందజేస్తే కోర్టును ఆశ్రయించి న్యాయం జరిగేలా కృషి చేస్తానన్నారు. అనంతరం ముదిగుబ్బలో ఇటీవల యాక్సిడెంట్‌కు గురైన జయప్రకాష్‌ను పరామర్శించి రూ. 20 వేలు అందజేశారు. ఆయన వెంట దేవేందర్‌రెడ్డి, కె.నారాయణస్వామి, రెడ్డప్ప, లక్ష్మీనారాయణ, సోమల ప్రకాష్, జయకృష్ణ, తదితరులు పాల్గొన్నారు

ఉచిత వైద్యశిబిరం

మడకశిర : మండల పరిధిలోని హారేసముద్రం గ్రామంలో ఆదివారం కడప హిమాలయ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఆ ఆసుపత్రి వైద్యుడు సుధాకర్ మడకశిర పట్టణానికి చెందిన వ్యక్తి కావడంతో తన నియోజకవర్గంలోని ప్రజలకు వైద్య సౌకర్యం కల్పించాలని ఉద్దేశంతో ప్రతి ఆదివారం నియోజకవర్గంలో ఏదో ఒక గ్రామంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసి రోగులకు ఉచితంగా చికిత్సలు నిర్వ హించి మందులు అందజేస్తున్నారు. శిబిరంలో డాక్టర్ కుబేదుల్లా రోగులను పరీక్షించి మందులు అందజేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం వల్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో పిఆర్వోలు వెంకటేష్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ కంట్రోలర్‌గా ఉత్తన్న

కదిరి టౌన్ : కదిరి డిపోలో కంట్రోలర్‌గా పని చేస్తున్న బి.ఉత్తన్న ఉత్తమ కంట్రోలర్‌గా ఎంపికయ్యాడు. ఆయన విధుల నిర్వహణతో పాటు సంస్థ అభివృద్ధి కోసం పలు సేవా విభాగాల్లో పాలుపంచుకొన్నాడు. కదిరి డిపో నుంచి త్రిలింగ దర్శనం, అరుణాచలంకు 6 బస్సులు, వివాహాలకు 20 బస్సులు బుక్ చేయించాడు. అలాగే మిత్రులు నల్లచెరువుకు చెందిన రామ్‌నాథ్, పాలెం సుధాకర్ సహకారంతో కదిరి బస్టాండ్‌లో కూలర్లు ఏర్పాటు చేయించాడు. నియోజకవర్గ పరిధిలోని 300 మంది దివ్యాంగులకు దాతల చేత ఉచితంగా రాయితీ పాసులు ఇప్పించాడు. అలాగే 500 మంది విద్యార్థులకు ఉచిత/ రాయితీ బస్సు పాసులను దాత పాలెం సుధాకర్ చేత ఇప్పించాడు. ఇతను సేవలకు ఇప్పటికే డిపో/రీజియన్/జోనల్ స్థాయిలో దాదాపు 15 సార్లు అవార్డులు/ రివార్డులు పొందారు. ఉత్తన్నసేవలు ప్రశంసనీయమని కదిరి డిపో అసిస్టెంట్ మేనేజర్ హరిమోహన్ తెలిపారు.

పోస్ట్ కార్డు ఉద్యమానికి విశేష స్పందన

హిందూపురం : హిందూపురం అసెంబ్లీ నుండి సిఎం జగన్ మోహన్ రెడ్డి పోటీ చేయాలని కోరుతూ వైసిపి నాయకుడు, శ్రీనివాస చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ వాల్మీకి నరేష్ ఆధ్వర్యంలో చేపట్టిన పోస్ట్ కార్డు ఉద్యమానికి విశేష స్పందన లభిస్తోంది. ఆదివారం హిందూపురం పట్టణ పరిధిలోని మొడాల్ కాలనీలో చేపట్టిన పోస్ట్ కార్డ్ ఉద్యమానికి మహిళల నుండి విశేష స్పందన లభించింది, రాబోయే ఎన్నికల్లో హిందూపురం అసెంబ్లీ నుండి పోటీ చేస్తే ఘన విజయం సాధిస్తారని మహిళలు పేర్కొన్నారు,

బదిలీ వైద్యురాలికి సన్మానం

హిందూపురం : సాధారణ బదిలీల్లో భాగంగా పిపి యూనిట్‌లో విధులు నిర్వహిస్తున్న వైద్యులు పద్మజ, ఇతర వైద్యులు, సిబ్బంది బదలీపై వెళ్లారు. ఈ నేపథ్యంలో బదిలీపై వెళుతున్న వైద్యులను ఇతర ప్రాంతాల నుంచి బబదలీపై ఇక్కడికి వచ్చిన వారిని ఆదివారం స్థానిక పిపి యూనిట్‌లో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పిపి యూనిట్ వైద్యాదికారి శ్రీనివాస రెడ్డి, వైద్యులు చంద్రశేఖర్, ఆనంద్ బాబు, గోవర్ధన్ రెడ్డి, వైద్య సిబ్బంది ముస్తఫా, రమేష్, శేఖర్, నబి తదితరులు పాల్గొన్నారు.

ధరల నియంత్రణ కోసమే డిపార్ట్‌మెంట్ స్టోర్

హిందూపురం : మార్కెట్‌లో ధరల నియంత్రణ కోసమే ప్రభుత్వం తరపున ప్రత్యేక స్టోర్‌ను ప్రారంభించినట్లు తహశీల్దార్ హసీనా సుల్తాన అన్నారు. ఆదివారం పట్టణంలోని మున్సిపల్ కాంప్లెక్స్ లోని రూం నెంబరు 14లో హోల్ సేల్ ఫుడ్ గ్రేయాన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ ప్రారంభించిన కౌంటర్‌లో సరసమైన ధరలకే నిత్యావసర వస్తువులు లభిస్తాయని. దీనిని ప్రజలందరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సిఎస్‌డిటి హారతి, ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఛైర్మన్ బైసాని రాంప్రసాద్, అసోసియేషన్‌ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను విమర్శించే స్థాయి ఎంపిపికి లేదు

ప్రజాశక్తి-రొళ్ల

ఎమ్మెల్యే తిప్పేస్వామిని విమర్శించే స్థాయి ఎంపిపికి లేదని మండల వైసిపి నాయకులు అభిప్రాయపడ్డారు. రొళ్లలో ఆదివారం మండల వైసిపి నాయకులు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ టిడిపి నాయకుల ప్రోద్భలంతోనే ఎంపిపి భర్త ఇలా రెచ్చిపోతున్నాడని మండిపడ్డారు. ఈ సమావేశంలో ఎంపీటీసీలు సౌమ్యనాగేంద్ర, యరగుంటేశ్వరప్ప, సర్పంచులు చిన్నరంగప్ప, హరీష్, శ్రీరామప్ప, రాజప్ప, నరసింహప్ప, అనిత, సింగిల్ విండో అధ్యక్షులు మోతిరామ్‌నాయక్, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ శ్రీనివాస్, జేసీఎస్ మండల్ కన్వీనర్ నాగేంద్ర, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు ఆంజనేయులు, సోషల్ మీడియా కన్వీనర్ మహంతేష్, తదితరులు పాల్గొన్నారు.

'భవిష్యత్తుకు గ్యారెంటీ'తో వైసిపిలో వణుకు


ప్రజాశక్తి-కదిరి టౌన్



రామగిరిలో ప్రజలకు మేనిఫెస్టోను వివవిస్తున్న నాయకులు

టిడిపి ప్రవేశపెట్టిన 'భవిష్యత్తుకు గ్యారెంటీ' పథకాలతో వైసిపిలో వణుకు పుట్టిందని నియోజకవర్గ ఇన్‌ఛార్జి కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. అంతకుముందు ఆయన మహిళా శక్తి రథానికి ఖాద్రీలక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ చంద్రబాబు మహిళలకు పెద్దపీట వేస్తూ మహాశక్తి పేరుతో మినీ మేనిఫెస్టో విడుదల చేశారన్నారు. వైసిపి అరాచక, మోసపూరిత విధానాలను ప్రజలు, మహిళలకు వివరించేందుకు ప్రజల్లోకి వెళ్తున్నామన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు డైమండ్ ఇర్ఫాన్, కౌన్సిలర్ సేగు సుధారాణి, మహిళా సీనియర్ నాయకురాలు పర్వీన్‌బాను, గంగారత్నమ్మ, సావిత్రమ్మ, ప్రేమలత, శోభ, రమణమ్మ, సుశీల, రత్నమ్మ, రొద్దం బషీర్, తదితరులు నాయకులు పాల్గొన్నారు.

రామగిరి : మండల పరిధిలోని గంతిమర్రి గ్రామంలో ఆదివారం టిడిపి నాయకులు ఇంటింటికీ వెళ్లి 'భవిష్యత్తుకు గ్యారెంటీ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళల ఆర్థిక పరిస్థితులు మెరుగయ్యేందుకు చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాలను ప్రకటించారన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ సుధాకర్, సీనియర్ నాయకులు రామ్మూర్తినాయుడు, పరంధామయాదవ్, తెలుగు యువత అధ్యక్షులు ఎల్.శ్రీధర్ నాయుడు, క్లస్టర్ ఇన్‌ఛార్జి శివకుమార్, నాయకులు ఎస్.ఆంజనేయు లు, అక్కులప్ప, డి.పోతన్న, సుబ్బ రాయుడు, స్థానిక నాయకులు బాలరాజు, బ్రహ్మ, చంద్రాయుడు, అక్కులప్ప, మాధవరెడ్డి, నారాయణస్వామి, వెంకటేష్, నాగరాజు, శంకరయ్య, మనోహర్, పెద్దన్న, చిట్టి నారాయణస్వామి, శ్రీరాములు, కిష్టప్ప, జయ రాములు, ముత్యాలప్ప, తదితరులు పాల్గొన్నారు.



దుర్గమ్మకు ఊరేగింపుగా బోనాలు తీసుకెళ్తున్న మహిళలు, మహిళలకు చీరలను పంపిణీ చేసున్న రాజు, విజయలక్ష్మీ

భక్తిశ్రద్ధలతో దుర్గమ్మకు బోనాలు

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

జాతర సందర్భంగా ఆదివారం పట్టణం లోని శాంతినగర్‌కు చెందిన మహిళలు దుర్గమ్మకు భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించారు. అలాగే 1వ వార్డు కౌన్సిలర్ చెలిమి రామకృష్ణమ్మ, చెలిమి పెద్దన్న, బైముతక రమణ ఆధ్వర్యంలో మహిళలు బోనాలు నెత్తిన పెట్టుకుని ఊరేగింపుగా దుర్గమ్మ గుడికి చేరుకుని అమ్మవారికి సమర్పించారు. అనంతరం మొక్కులు తీర్చుకున్నారు. 13వ వార్డులో బోనాలను ఎత్తికెళ్లిన 150 మందికి మాజీ కౌన్సిలర్ డిష్ రాజు, అతడి భార్య విజయలక్ష్మీ చీరలు పంపిణీచేశారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, వెంకటేష్, పోతలయ్య, పట్టణ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

పొంచిఉన్న ప్రమాదం



విద్యుత్ స్తంభం వద్ద సామకోటి సెల్ఫీ ఛాలెంజ్

పుట్టపర్తి అర్బన్ : కూలిపోవడానికి సిద్ధంగా ఉన్న విద్యుత్ స్తంభంతో ప్రజలు భయాందోళనలు చెందుతున్నారని టిడిపి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ తెలిపారు. పుట్టపర్తిలో ఆదివారం ఆయన మాట్లాడుతూ పుట్టపర్తిలోని తారకరామనగర్‌లో ఓ విద్యుత్ స్తంభం కూలిపోవడానికి సిద్ధంగా ఉందని, అది ఎప్పుడు కూలుతుందోనని ఆందోళన చెందుతున్నారన్నారు. ఈ స్తంభం గతంలోనే పాడవగా దానికి విద్యుత్ అధికారులు ఇనుప చువ్వలు చుట్టి చేతులు దులుపుకున్నారని మండిపడ్డారు. నిత్యం పట్టణం నుంచి పెద్దకమ్మవారిపల్లికి ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. అలాగే సమీపంలోని ధీనజనార్ధన భవన సముదాయంలో ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నాయ న్నారు. ఆ కార్యాలయాలకు చాలామంది ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారన్నారు. ఈ విషయాన్ని గతంలో కాలనీవాసులు పలుమార్లు విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని పేర్కొన్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే ఆ శాఖ అధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

చంద్రబాబుతోనే భవిష్యత్తు



టిడిపి మేనిఫెస్టోను ప్రజలకు వివరిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-ముదిగుబ్బ : టిడిపి అధినేత చంద్రబాబుతోనే రాష్ట్రానికి భవిష్యత్తు అని పార్టీ రాష్ట్ర కార్యదర్శి గోనుగుంట్ల విజయ్ కుమార్ తెలిపారు. టిడిపి నాయకులు ఆదివారం మండల పరిధిలోని కొడవండ్లపల్లి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి మినీ మేనిఫెస్టో గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో తెలుగు రైతు కార్యదర్శి రమేష్‌బాబు, మండల కన్వీనర్ కరణం ప్రభాకర్, తుమ్మల మనోహర్, తుమ్మల సూరి, లింగారెడ్డి, హరినాథ్, నాగప్ప, రాములు, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి అనూహ్య స్పందన

ప్రజాశక్తి-కదిరిటౌన్

రిషిత హాస్పిటల్ ఆధ్వర్యంలో నంద్యాలకు చెందిన శాంతిరాం వైద్యశాల సహకారంతో ఆదివారం పట్టణం లోని రాణిపేట పాఠశాలలో ఉచిత కంటి, గుండె వైద్య శిబిరం నిర్వహించగా అనూహ్య స్పందన లభించింది. ఈ శిబిరంలో 210 మందికి కంటి, గుండె సంబంధిత పరీక్షలు చేసి 60 మందికి కంటి లేజర్ శస్త్ర చికిత్స, ఇద్దరికి గుండె సంబంధిత చికిత్స అవసరమని గుర్తించారు. వీరిని డాక్టర్ సురేష్ ఆధ్వర్యంలో వారి బస్సులోనే నంద్యాల శాంతిరాం హాస్పిటల్‌కు పంపించారు. అంతకుముందు స్థానిక చిన్న పిల్లల వైద్య నిపుణులు, రిషిత చిన్నపిల్లల హాస్పిటల్ వ్యవస్థాపకులు డాక్టర్ సివి మదన్‌కుమార్ 30 మందికి లేజర్ శస్త్ర చికిత్స చేశారు. శిబిరాన్ని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి సి.తాహేర్‌వలి, ఎపి ఎన్జీవో సెక్రటరీ బాషా కార్యక్రమం పర్యవేక్షించారు. రోటరీ క్లబ్ ఆఫ్ కదిరి ప్రెసిడెంట్ పృథ్వీరాజ్, రంజిత్ తోడ్పాటు అందించారు. రిషిత చిన్న పిల్లల ఆసుపత్రి సిబ్బంది సహాయ సహకారాలు చేశారు.

గౌనిపల్లెలో మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి-ఓబుళదేవరచెరువు

మండల పరిధిలోని గౌనిపల్లెలో ఆదివారం అల్లాపల్లి టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షులు ఆర్ఎంపి కృష్ణమూర్తి ఆధ్వర్యంలో అనంతపూరంలోని సవేరా హాస్పిటల్ వైద్య నిపుణులచే ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 200 మంది ప్రజలు వివిధ వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ జయచంద్ర, మల్లెల రమేష్, బోయపల్లి శివారెడ్డి, రమణారెడ్డి, లక్ష్మీనరసు రంగయ్య, హనుమంత్‌రెడ్డి, స్కూల్ కమిటీ ఛైర్మన్ మావిటి రాజేష్‌గౌడ్, శివనారాయణ, వెటర్నరీ అసిస్టెంట్ రామకృష్ణ, వెంకటస్వామి, మైరాడ సుధాకర్, బిల్లూరి శ్రీనివాసులు, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

జనసేన క్రికెట్ టోర్నీ విజేత శ్రీకాంత్ లెవెన్స్

ప్రజాశక్తి-సోమందేపల్లి

జనసేన మండల అధ్యక్షులు జబివుల్లా ఆధ్వర్యంలో సోమందేపల్లిలో 15 రోజులుగా జరుగుతున్న జనసేన క్రికెట్ టోర్నమెంట్ విజేతగా శ్రీకాంత్ లెవెన్స్ నిలిచింది. ఆదివారం జరిగిన ఫైనల్ పోటీలో పెనుకొండ అన్న థండర్స్, శ్రీకాంత్ లెవెన్స్ జట్లు తలపడగా శ్రీకాంత్ లెవెన్స్ విజేతగా నిలిచింది. దీంతో ఎస్ఐ విజయ్ కుమార్ విజేత జట్టుకు రూ. 30 వేల నగదు, ట్రోఫీ అందజేశారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.